మరో 40 రోజులే గడువు

- పన్నులు చెల్లించేందుకు దగ్గరపడుతున్న సమయం
- ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను వసూళ్లలో ముందంజ
- నీటి పన్నుల వసూళ్లలో కానరాని ప్రగతి



నగరంలోని భవన సముదాయాలు

విజయనగరం: స్థానిక సంస్థలకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయం ఎంతో కీలకం. నగర అభివృద్ధికి ఈ నిధులు సమకూర్చుకోవడం ప్రాధాన్యతాంశం. ప్రతి ఏడాదీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాల్లో నిధులు మంజూరు చేస్తున్నా... స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఖజానాను నింపుకోవడం కీలకమనే చెప్పాలి. అలా ఆదాయాన్ని సమకూర్చుకున్నపుడే అభివృద్ధి సాధ్య పడుతుందని అధికారులు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గడిచిన 57 నెలల కాలంలో నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా నగర రూపురేఖలు మారాయి. కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరంలో అదే స్థాయిలో సుందరీకరణ, జంక్షన్ల అభివృద్ధి, ప్రధాన రహదారుల విస్తరణ.. డివిజన్ల పరిధిలో రోడ్లు, కాలువల నిర్మాణాలు గతంలో ఎన్నడూ లేని విధంగా జరిగాయని చెప్పడంలో సందేహం లేదు. ఇదే క్రమంలో వివిధ రూపాల్లో రావాల్సిన పన్నుల ఆదాయం సకాలంలో చెల్లింపులు జరిగితే మరింత అభివృద్ధి సాధ్యపడుతుందన్న భావనను అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్ పరిధిలో ఇదీ పరిస్థితి..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 69,149 అసెస్‌మెంట్లు ఉండగా... వాటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.19.57 కోట్ల ఆదాయం పన్నుల రూపంలో రావాల్సి ఉండగా... ఇప్పటివరకు రూ.15.27 కోట్లు వసూలు చేశారు. మరో రూ.4.27 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అదేవిధంగా గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో వసూలు కాని మొండి బకాయిలు రూ.23.91 కోట్లు ఉండగా... ఇప్పటివరకు రూ.2.21 కోట్లు వసూలు చేశారు. మరో రూ.21.68 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అదేవిధంగా తాగునీటి పన్నులకు సంబంధించి 24,660 అసెస్‌మెంట్లు ఉండగా... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.75 కోట్ల డిమాండ్ ఉండగా... రూ.0.62 లక్షలు వసూలు చేశారు. రూ.1.29 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఖాళీ స్థలాలకు సంబంధించి 2700 అసెస్‌మెంట్లు ఉండగా... వాటి ద్వారా రూ.1.30 కోట్లు రావాల్సి ఉండగా... ఆ మొత్తాన్ని సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ అధికారులు వసూలు చేశారు. కార్పొరేషన్‌కు సంబంధించిన దుకాణాలకు సంబంధించి 225 అసెస్‌మెంట్లు ఉండగా... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాటి ద్వారా రూ.0.77 కోట్లు రావాల్సి ఉండగా... రూ.0.44 కోట్లు వసూలైంది. మరో రూ.0.32 కోట్లు వసూలు కావాల్సి ఉంది.



తాగునీటి కుళాయి వద్ద నీరు పడుతున్న మహిళలు

మొండిబకాయిలపై దృష్టి సారించేనా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ ద్వారా పన్నుల వసూళ్లు మెరుగుపడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు జరిగినప్పటికీ, గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లలో యంత్రాంగం విఫలమవుతోంది. దీంతో ఆస్తి పన్నుల రూపంలో రూ.14.21 కోట్లు, నీటి పన్నుల రూపంలో రూ. 3.90 కోట్లు, ఖాళీ స్థలాల నుంచి రూ. 14.21 కోట్లు, అద్దె దుకాణాల నుంచి రూ.1.20 కోట్లు బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కల వెల్లడిస్తున్నాయి. పేరుకుపోయిన బకాయిలు రాబడితే నగరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది.

మార్చి 31లోగా పన్ను చెల్లించాలి



2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భవనాలు, నీరు, ఖాళీ స్థలాలు, అద్దె దుకాణాల ద్వారా రావాల్సిన పన్నులు చెల్లించేందుకు సమయం దగ్గరపడుతోంది. మార్చి 31లోగా సంబంధిత యజమానులు నిర్ణీత పన్ను మొత్తాన్ని చెల్లించాలి. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తున్నాం. ప్రజలంతా సహకరించి పన్నులు చెల్లించడం ద్వారా నగర అభివృద్ధికి సహకరించాలి.

– ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

క్లుప్తంగా

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఏపీ టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సతివాడ జేటీఎస్ఎం కళాశాలలో సీనియర్ విద్యార్థులకు బుధవారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు జగనన్న నిత్యం కృషి చేస్తున్నారని, వివిధ పథకాల ద్వారా చేయూతనిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన



ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న బీఎల్‌ఓ హైమావతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేటలో దివ్యాంగ ఓటర్లకు ఓటుహక్కు వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలనే అంశంపై స్థానిక బీఎల్‌ఓ ఎం. హైమావతి దివ్యాంగులకు వివరించారు. దివ్యాంగులకు ఎలక్షన్ కమిషన్ కల్పించిన సౌకర్యాలు, రవాణా, తదితర అంశాలను తెలియజేశారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు



ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: నగరంలోని గాంధీనగర్ సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు దక్షయ రాంనాయుడు, ఎల్. వినోద్, ఎస్. మౌనికవందన, టి.రమణమ్మ వంద మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్‌చైర్మన్లు సముద్రపు రామారావు, నాపాడ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, బోర్డు డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం



ప్రవచనం చెబుతున్న మాధవి

విజయనగరం టౌన్: నగరంలోని రింగురోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహా సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రవచనకర్త కె.మాధవి బుధవారం చేసిన ఆధ్యాత్మిక ప్రవచనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రామాయణంలోని పలు కీలక ఘట్టాలను అనుగ్రహభాషణం చేశారు. శ్రీనివాస సేవా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా విజయకుమార్, చెరుకూరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



దేవతామూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని బుధవారం కనులపండువగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు చాణక్య, జీఎస్ హర్ష ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్నపనం, పంచామృతభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చన చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, పద్మశ్రీ, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఏవీ రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

- చేసిన మంచిని ప్రజలకు వివరించాలి
- ఎంపీపీ అప్పలనాయుడు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు అన్నారు. ప్రజాబలానికి వీరి బలం తోడైతే విజయం ఖాయమని తెలిపారు. మండలంలోని గుంకలాంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి జరిగిందని చెప్పారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థతో తీసుకువచ్చారని కొనియాడారు. వైఎస్సార్ పింఛను కానుక, విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు, అందరికీ ఇళ్లు పథకం, జగనన్న చేయూత, వైఎస్సార్ ఆసరా, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష, రైతుభరోసా వంటి పథకాలతో రాష్ట్రంలో సంక్షేమం కొనసాగుతోందని చెప్పారు. ఇటువంటి సంక్షేమ రథసారథికి రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి హయాంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికీ వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, సర్పంచ్ కునుకు నాగరాజు, మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

భోగాపురం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దాసరి బంగారయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

24న బహిరంగ వేలం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఆశీల వసూళ్లకు ఈ నెల 24న బహిరంగ వేలం వేయనున్నట్లు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ చిన్ని తిరుమలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే వేలంపాటలో ఆసక్తి గలవారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

విజయనగరం ఫోర్ట్: కలెక్టరేట్ సబ్‌స్టేషన్‌లో గల 11కేవీ కణపాక ఫీడర్ మీద ఉన్న చెట్ల కొమ్మలను తొలిగించనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కణపాక, కామాక్షినగర్, కాళీఘాట్ కాలనీ, ఉడా కాలనీ ఫేజ్–4, తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సందర్శన

నెల్లిమర్ల: లిప్ కార్యక్రమంలో భాగంగా స్టేట్ టీమ్ సభ్యులు పి. ఈశ్వరరావు, దొర స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో 7, 8 తరగతులకు సంబంధించి గణితం, ఆంగ్లం తరగతులను పరిశీలించి, తగు సూచనలు చేశారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జీఎం శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలోని గరల్స్ హాస్టల్‌లో మాతృభాషా దినత్సోవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ.. మనిషి జీవితంలో మొదట నేర్చుకునేది మాతృభాషేనని చెప్పారు. దేశంలో సాంస్కృతిక, భాషా వైవిధ్యాలను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాదీ మాతృభాష దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామమూర్తి, చీఫ్ వార్డెన్ సత్యవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన గ్రంధి దివ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు డెంకాడ మండలం మోపాడ గ్రామంలోని తన స్వగృహంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు బుధవారం అందజేశారు. దివ్యకు ముందస్తు డెలివరీ కావడంతో ప్రత్యేక ఆపరేషన్‌తో పాటు వైద్యసేవలు అందించాల్సి వచ్చింది. దీంతో దివ్య కుటుంబ సభ్యులు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో రూ. 2.60 లక్షలు మంజూరు కావడంతో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు

విజయనగరం ఫోర్ట్: ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లకుకు ప్రభుత్వం ఇచ్చిన జీఓల ప్రకారం సక్రమంగా జీతాలు, పీఎఫ్ డబ్బులు చెల్లించకుండా శ్రమ దోపిడీ చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి గేటు ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, పెస్ట్ కంట్రోల్ సిబ్బందికి ప్రభుత్వ జీఓ 549 ప్రకారం రూ. 16 వేలు, సెక్యూరిటీ గార్డులకు రూ.12,688 జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సన్యాసమ్మ , లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరిసాగులో సస్యరక్షణ తప్పనిసరి

- కోకోనట్ బోర్డు డైరెక్టర్ అరవల్



పతివాడలో కొబ్బరిసాగు పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు

పూసపాటిరేగ: కొబ్బరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోకోనట్ బోర్డు డైరెక్టర్ అరవల్ అన్నారు. మండలంలోని చినపతివాడ, పతివాడ గ్రామాలలో బుధవారం పర్యటించి కొబ్బరిసాగు తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా చీడపీడల నివారణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీడీ కుమరెవెల్, ప్రిన్సిపాల్ సైంటిస్టు బీవీకే భగవాన్, డీహెచ్‌ఓ జమదగ్ని, ఉద్యానవన సహాయ సంచాలకురాలు శైలజ, ఉద్యానవనశాఖ అధికారి జ్యోత్స్న, వీహెచ్ పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలి

- ఏఎంసీ చైర్‌పర్సన్ అరుణకుమారి



మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణకుమారితో సభ్యులు, సిబ్బంది

పూసపాటిరేగ: మార్కెట్ కమిటీ అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఏఎంసీ చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కమిటీ పరిధిలో 2024–25 సంవత్సరానికి గాను కోటీ 65 లక్షల ఆదాయం సముపార్జించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. నెల్లిమర్ల, మోదవలసలో మార్కెట్ గోదాముల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. భోగాపురం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో త్వరలో రైతుబజార్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీ పరిధిలో గల పూసపాటిరేగ, డెంకాడ, నెల్లిమర్ల, భోగాపురం మండలాల్లో కిరాణా షాపులకు ట్రేడింగ్ లైసెన్స్‌లు పునరుద్ధరించి కమిటీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు, అధికారులకు సూచించారు. మార్కెట్ కమిటీకి వచ్చే ఆదాయంలో అధిక మొత్తం సిబ్బంది జీతాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లకు ఖర్చవుతోందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్. సతీష్‌కుమార్, సీనియర్ సహాయకులు చిన్నమ్మలు, ప్రజాప్రతినిధులు చిక్కాల సాంబశివరావు, టొంపల సీతారాం, పోలుబోతు నారాయణమూర్తి, రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ప్లాస్టిక్ నియంత్రణ

- కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు



కేఎల్ పురం ప్రాంతంలో పర్యటిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: అందరి సహకారంతోనే ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. నగరంలోని కేఎల్ పురం ప్రాంతంలో బుధవారం ఆయన పర్యటించి, పారిశుధ్య పరిస్థితిని పరిశీలించారు. అక్కడక్కడ చెత్త పేరుకుపోవడంతో సిబ్బందిని హెచ్చరించారు. కొంతమంది వ్యాపారులు పాలిథిన్ సంచులలో వేడి పదార్థాలు వేయడాన్ని గుర్తించి మందలించారు. అలాగే కొనుగోలుదారులు కూడా టిఫిన్ బాక్సులు వంటివి తెచ్చుకొని ఆహార పదార్థాలను తీసుకెళ్లాలని సూచించారు. పాలిథిన్ వాడకం వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్ల అభివృద్ధికి కృషి

- ఏఎంసీ వైస్ చైర్మన్ రెడ్డి గురుమూర్తి



స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ గురుమూర్తి

విజయనగరం ఫోర్ట్: రైతు బజార్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఏఎంసీ వైస్ చైర్మన్ రెడ్డి గురుమూర్తి అన్నారు. నగరంలోని దాసన్నపేట రైతు బజార్‌లో రూ. 18 లక్షల వ్యయంతో నాలుగు బ్లాక్‌లను ఆధునీకరించి నూతనంగా ఏర్పాటు చేసిన 28 స్టాల్స్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతుబజార్లలో బినామీలకు చెక్ పెట్టి అర్హులైన రైతులు కూరగాయాలు విక్రయించుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రైతు సంక్షేమానికి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాటు పడుతోందని తెలిపారు. వైఎస్సార్ రైతుభరోసా పేరిట ప్రతి ఏటా సాగు పెట్టుబడికి రైతులకు రూ. 13,500 ఆర్థిక సాయం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో 10 వార్డు కార్పొరేటర్ నాయన పద్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, ఏఎంసీ కార్యదర్శి భారతి, ఎస్టేట్ అధికారి పతివాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి..

- ఏపీ మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డి



మాట్లాడతున్న ఏపీ మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డి

భోగాపురం: విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏపీ మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎం. వెంకట కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంగ్లిష్, ఎకనామిక్స్, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులపై పీజీటీలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం విద్యార్థులు సాధించిన ఫలితాలను విశ్లేషించి, ప్రస్తుత సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యార్థుల స్థాయి, సామర్థ్యాలను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్న అతి తక్కువ సమయాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు. అలాగే ప్రత్యేక తరగతులు నిర్వహించి వాటిపై స్లిప్ టెస్టులు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో ఆర్‌జేడీ ఎం. జ్యోతికుమారి, సీబీఎస్ఈ రాష్ట్ర కోఆర్డినేటర్ సి. శ్రీలత, ఏఎంఓ డి.కుమార్, ఏఏఎంఓ శరత్‌బాబు, ఎంఈఓలు రమణమూర్తి, చంద్రమౌళి, ప్రిన్సిపాల్ పార్వతి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురంలో కళాజాత బృంద సభ్యులు హెచ్‌ఐవీపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ బంగారుబాబు మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ సోకకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది ఆర్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేష్‌వర్మ

పూసపాటిరేగ: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి రాజేష్‌వర్మ కోరారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఐదేళ్లలోపున్న చిన్నారులందరికీ వ్యాక్సిన్ వేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని 46 గ్రామాలలో 3500 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. గ్రామస్థాయిలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యురాలు ప్రమీలాదేవి, హెల్త్ సిబ్బంది ఆర్‌వీ రమణ, బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొప్పెర్ల పార్వతమ్మ జాతర ప్రారంభం



పూసపాటిరేగ: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు కొప్పెర్ల పార్వతమ్మ 54వ జాతర బుధవారం ప్రారంభమైంది. ఈ నెల 23 వరకు జాతర జరుగుతుందని ఆలయ ధర్మకర్తలు ఇనకోటి వంశీయులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఎస్సై ఎ.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పైడితల్లిని దర్శించుకున్న నిత్య విద్యానంద భారతి స్వామీజీ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారిని గుంటూరు జిల్లాకు చెందిన నిత్య విద్యానంద భారతి స్వామీజీ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు సంప్రదాయప్రకారం స్వాగతం పలకగా.. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, పైడితల్లిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. గుంటూరులో ఉన్న ఆదిపరాశక్తి ఆలయ నిర్మాణం కోసం దక్షిణ భారతదేశమంతా భిక్షాటన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, వేదపండితులు తాతా రాజేష్, దూసి శివప్రసాద్, శంబర కృష్ణ, తాళ్లపూడి ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.